# దొర

ఉదయం అయిదుగంటలు. బెజవాడ ప్లాట్‌ఫారం కాకినసుకుతోనూ కొత్త కంపులతోనూ కిటకిట లాడుతోంది. అప్పుడే ఆమెని రైలులో ఎక్కించాను. రైలు ఆవిణ్ణి తీసుకుపోతోందే అను దిగులుతో, కడ్డీలు పట్టుకు దీనంగా నుంచున్నాను. తొలికిరణాలు ఈ ప్రపంచపు మురికిని తాకని వేకువజాములో, సుమతి కళ్ళలో కొత్తలోకాల ఛాయలని వెతుకుతూ... ...

మబ్బులు గబగబా కమ్ముకున్నాయి. వర్షపు గాలి రివ్వున వీచింది. సన్నతుంపర.

“బెజవాడ స్టేషనులో రయిళ్ళు ఈ చివరా ఆచివరా ఆగుతాయిగాని, వర్షం పడకుండా వుండే చోట ఆగవేం!” అని అడిగింది సుమతి.

ఎవరికి తెలుసు? ప్రశ్నలకి ప్రతిప్రశ్నలే గాని సమాధానాలు లేవుగా—యుద్ధం కనక! పక్కనే ఒక రిక్రూటింగ్ ఆఫీసరు తన కాకిమనుషులకి స్టేషన్‌మాస్టరు పెట్టె రిజర్వుచేయించలేదని పై

అధికారితో అరవంలో మాట్లాడుతున్నాడు యింగ్లీష్! ఆ ఆఫీసర్ హిందూస్తానీలో జవాబు చెప్తూ కొత్తచుట్ట ముట్టించాడు.

చిటపట చినుకులకి తల తడవగా రేకుల కిందికి వెళ్ళాను. సుమతివున్న పెట్టె దూరాన్నుంచిచూస్తూ స్తంభానికానుకు నుంచున్నాను. పక్కగా రెస్టారెంటు కాదు.

కారులో 'బాయిస్' యింకా కళ్ళు నులుపుకుంటున్నారు. టీకాగు పొయ్యిమీద కెక్కలేదు. దొరగారొకరు పైపు వెలిగించి, పొగ గుప్పుగుప్పున వదులుతున్నాడు. దిట్టంగా లావుగా వున్నాడు. పొడవుచెప్పడం కష్టం—ఎందుకంటే కూచునే వున్నాడు కనక. ఆ పెద్దకారులో ఒక్కడూ బిక్కు బిక్కు మంటూ కూచున్నాడు.

ఎవరీ దొర? విశాలమైన మొహంలోని ఆ చిన్నకళ్ళు ఊహించేతీరు పరిశీలిస్తే అతనేదో భావనాసముద్రంలో మునిగివున్నా డనిపిస్తుంది. తోటిదొరల బెడ్‌టీవేళ కాకపూర్వమే ఈయనెందుకు యిలా లేచాడు? ఇలా ఒక్కడూ ఏకాంతంగా కూచుని ఏమిటి ఆలోచిస్తున్నాడు?

అతనిది ఏషైరు? స్కాట్లండులో వాడా?

పెళ్లాం బిడ్డలు జ్ఞాపకం వస్తున్నారు గాబోలు! పాపం—యితని అప్పులు ఎందరు 'బ్రిటన్ యుద్ధం'లో నమసిపోయారో! మిగిలినవారు శక్కల బాంబుల వుత్పాతాన్ని తప్పించుకోగలిగారూ? ఇతనియిల్లు యింకా కూలిపోకుండా వుందా? బిడ్డలు ఏఏ దేశాల పాలయ్యారో! తలకోదారి.

ఏ అజ్ఞాత బాధలు నక్షత్రాలతో సంక్రమించిన అధికారంతో తృప్తిపడక అతన్ని అశాంతి పాలు జేస్తున్నాయో! ఒక్కసారి అతనిదగ్గిరసా వెళ్ళి "ఏమిటండీ—అంత దీర్ఘంగా తపనపడుతున్నారు?" అని అడగాలనిపించింది. అడగాలనే వెర్రివుబలాటమేగాని—అడిగి తెలుసుకోగలమా ఇతరులబాధలు? అదీకాక, నల్లవాడికీ తెల్లవాడికీ మధ్య మాటలు నడిచేందుకు భాషేదీ!

బాధలో బాంధవుడయిన ఆ దొరని చూస్తూ అలానే నుంచున్నాను. ఎన్ని వేలమైళ్ళు వచ్చాడూ 'తెల్లవాడిబరువు' మోసేందుకు యితగాడు! నడుం విరిగే బరువుతో కుంగిపోతున్న పాశ్చాత్యుల్లో యితనొకడా! బ్రిటన్‌కి హృదయం లేదూ? అదే వెతుకుతున్నాడు గాంధీజీ. బ్రిటనంటే షా, వెల్సు, హాక్స్‌లే, హాల్డేనుమాత్రం కాదు.

దొరా, నిన్ను చూస్తే జాలేస్తోంది. ఘాతీవిరుచుకు ఎక్కడికా పరుగులు? ఏ ప్రపంచవ్యవస్థ నిర్మించబోతున్నావు, నాయనా! నాజీముట్టడినీ ఫాసిస్టు విజృంభణాన్ని జయప్రదంగా ఎదుర్కొన్న నీ ప్రజల అకుంఠిత ధైర్య విశ్వాసాలకి ప్రపంచమే జోహారులర్పిస్తోంది కాని, 'వార్సయిల్స్' గాదు ముందుజరగవలసినపని !—కీర్తిశేషుడైన విల్కి-కలలుకన్న ఏకైక ప్రపంచనిర్మాణం. ఏదో గొణుక్కుంటున్నానులే! నువ్వూ నాలాగే అసహాయుడివి. నాకా విషయం లీలగా తెలుసు, ఈ ప్రపంచ శక్తుల పోరాటంలో, ఈ జీవుల పరిణామావస్థలో, ఈ యుగసంధి సమయంలో - నువ్వెంత ? - నేనెంత ?—షర్మ్రజామీద వెయ్యి బాంబర్ల దాడెంత ?—

నలుగురు పిల్లలు—ఎంగిలాకులతో పొట్టపోసుకునే దౌర్భాగ్యులు—దొరపెట్ట దగ్గిరిగాజేరి "సార్, సార్" అంటూ చుట్టేశారు. సగం తిన్న రొట్టెముక్కో, కాలుస్తూవున్న సిగరెట్టుపీకో, ఖాళీడబ్బో దొరక్కపోతుందా అని వాళ్ళ దేవులంపు. కోతులముందు తినేవస్తువులు పడేసి, అవి తినడాన్ని ఆనందించే పిల్లల్లా దొరలకి ఈ 'సార్'

మూకలమీదికి పండో ఫలమో విసిరి, వాళ్ళు దానికోసం ఎలా కొట్లాడుకుంటారో చూడటం సరదా. ఈ దొరమాత్రం అలాటివాడు కాడు. వాళ్ళు తనను చీకాకు పరుస్తున్నా, గమనించనట్లుగా ఆలోచనలో మునిగివున్నాడు.

వాన వెలిసింది. రైలు కూసింది. "సార్, సార్" అని ఏనాదిమూక బిగ్గిరిగా మొరగడం మొదలెట్టింది. దొర కనుబొమలు ముడిపెట్టాడు. ఇండియా అనగానే యిలాటి దృశ్యాలు అతనికి స్ఫురిస్తాయి కాబోలు!

బీవర్లీ నికోల్స్‌లా మరో 'తీర్పు' రాసి పారెయ్యడుగదా అను సంశయంతో సుమతి పెట్టె వైపుగా నడుస్తున్నాను. రైలు నాకంటె ముందు సాగింది. చిరువెలుతురులో సుమతి రుమాలా, తొంగిచూసే దొరవైపూ కనిపించాయి.

(అక్టోబరు 44)